www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 20 ఆగస్టు 2023

5

చిత్తూరు

27న ఆటో యూనియన్ ప్రథమ మహాసభ

సూళ్లూరుపేట : తిరుపతి జిల్లా ఆటో కార్మిక యూనియన్ ప్రథమ మహాసభ 27న శ్రీకాళహస్తిలో జరగనుంది. ప్రధానమైన తమ 16 డిమాండ్లను పరిష్కరించాలని ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఆటో కార్మిక నాయకులు మురళి, సిఐటియు నాయకులు కె.లక్ష్మయ్య, బి.పద్మనాభయ్య. పి.మనోహరం, ఆటో కార్మిక నాయకులు సుందరరాజ, చంద్రయ్య, రమణయ్య, రఘు, కరీమ్, మునిక్రిష్ణ పాల్గొన్నారు.

ముక్కంటి క్షేత్రంలో...

'రాహుకేతువులు' తిష్ట

ఉచిత సేవల పేరుతో ఎంట్రీ / ట్రస్టు బోర్డు ఫిర్యాదులూ బేఖాతర్

ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల దందా ఆగేలా లేదు. అధికారపార్టీ సిఫార్సులతో ఉచిత సేవల పేరిట ఆలయంలోకి ఎంట్రీ ఇస్తున్న కొందరు విధులు మాని దళారుల అవతారమెత్తుతున్నారు. శీఘ్ర, అంతరాలయ దర్శనం పేరుతో భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఉచిత సేవల ముసుగులో ఆలయ పీఆర్వో కార్యాలయంలో తిష్ట వేసి దందాలకు పాల్పడుతున్నారు. దళారుల దందా కారణంగా ఆలయానికి భారీగా నష్టం వాటిల్లడంతో పాటు చెడ్డ పేరు మూట కట్టుకోవాల్సి వస్తోంది. ఈ విషయంపై ఆలయ ధర్మకర్తల మండలి పలు మార్లు ఆలయ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయం రాహు-కేతు సర్పదోష నివారణ పూజలకు ఖ్యాతి గాంచింది. ఈ పూజల కోసం దేశ, విదేశాలకు చెందిన భక్తులు నిత్యం వేలాదిగా వస్తుంటారు. రాహు-కేతు పూజల్లో రూ.500. రూ.750, రూ.1,500, రూ.2,500, రూ.5వేలు టికెట్లతో ఇలా ఐదు రకాల రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు నిర్వహిస్తారు. ఈ ఐదు రకాలకు సబంధించి రోజుకు సగటున 4వేలు వరకు రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు జరుగుతాయి. వారాంతాల్లో 5వేలకు పైగా ఈ పూజలు జరుగుతాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను కొంతమంది దళారులు శీఘ్ర, అంతరాలయ దర్శనం పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. శీఘ్ర దర్శనం కోసం ఆలయం వారు రూ.200 టికెట్టు ఖరారు చేశారు. అయితే దళారులు ఈ టికెట్టు కొనుగోలు చేయకుండా భక్తులను అడ్డదారిలో దర్శనానికి తీసుకెళతారు. అలా తీసుకెళ్లినందుకు రూ.500 నుంచి రూ.1,000 వరకు భక్తుల వద్ద గుంజుతారు. ఇక అంతరాలయ దర్శనం పేరుతో రూ.1,000 వరకు వసూలు చేస్తున్నారు. సామాన్య భక్తులకు వివిధ ఆంక్షలు విధించే ఆలయ అధికారులు దళారుల విషయంలో మాత్రం ఏ నిబంధన విధించడం లేదు. దళారులు వచ్చిన వెంటనే వారికి స్వాగతం పలుకుతూ దర్శనానికి అనుమతిస్తున్నారు. కొంతమంది దళారులు వాహనాల పార్కింగ్ ప్రదేశం నుంచే భక్తులతో దర్శనానికి ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. అంతరాలయ దర్శనానికి రూ.1,500 అవుతుందనీ, తమకు రూ.1,000 సరిపోతుందని చెబుతారు. దళారుల మాటలు నమ్మి వారు చెప్పినట్లు డబ్బు ఇచ్చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ ప్రదేశంలో ఓ దళారి భక్తులతో ఒప్పందం కుదుర్చుకునే వీడియో ఒకటి ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దళారుల అడ్డాగా పిఆర్ఒ కార్యాలయం మారిందన్న విమర్శలను మూటగట్టుకుంది. ఉన్నతాధికారులకు 'దక్షిణ' సమర్పించగా వీరి ఆదాయం రోజుకు 5-10వేలు ఉంటుందని అంచనా. పాలకమండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాత్రం 'ప్రజాప్రతినిధి నుంచి అనుమతి వస్తే రెండు గంటల్లో దళారులను ఏరిపారేస్తాం' అని ప్రకటించడం గమనార్హం.

పంచాయతీ ఉప ఎన్నిక ప్రశాంతం

■ గుడిపల్లిలో టిడిపి ఘన విజయం ■ వైసిపి మద్దతుదార్లదే హవా

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్, యంత్రాంగం

చిత్తూరు జిల్లాలో భారీ బందోబస్తు నడుమ ఉప ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఎన్నికలు జరగాల్సిన మూడు గ్రామపంచాయతీలు విజయపురం మండలం మల్లికాపురం, కార్వేటినగరం మండలం కత్రిపల్లి, జీడీనెల్లూరు మండలం జీడీనెల్లూరు పంచాయతీ సర్పంచి స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇక వార్డుల విషయానికి వస్తే గుడిపాల మండలం పానాటూరు, పెద్దపంజాణి మండలం పెండకురికుంట వార్డులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. 37 వార్డుల్లో నామినేషన్ల స్క్రూట్నీ తరువాత ఒక్కో అభ్యర్థి మాత్రమే మిగలడంతో ఏకగ్రీవంగా అధికారులు ప్రకటించారు. శాంతిపురం మండలం కడపలి 10వ వార్డు, మత్యం 10వ వార్డు, యాదమరి మండలం కాశిరాళ్ల రెండో వార్డు, వి.కోట మండలం కొంగాటం ఒకటో వార్డు, జీడీనెల్లూరు మండలం వరత్తూరు రెండో వార్డు, ఐరాల మండలం కాణిపాకం ఐదో వార్డు, గుడిపల్లి మండలం పెద్దబ్బనవాడ నాలుగో వార్డుకు శనివారం ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు జరిగే ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఎంపిడిఒ, తహశీల్దార్, ఎస్ఐలను నియమించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎస్పి స్వయంగా యాదమరి మండలంలోని కాశిరాళ్ల గ్రామపంచాయతీ ఎన్నికల సరళిని పరిశీలించారు. జడ్పి సిఇఒ ప్రభాకర్‌రెడ్డి కాణిపాకం పంచాయతీలో పర్యవేక్షించారు. ఉదయం నుండీ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల్లోనే ఓట్లను లెక్కించి ఎన్నికల అధికారులు విజేతలను ప్రకటించారు.

గుడిపల్లి: విజయోత్సవ వేడుకల్లో టీడీపీ నాయకులు

వార్డు విజేతలు వీరే...

శాంతిపురం మండలం కడపల్లి పంచాయితీ 10వార్డులో బి. సుధాకర్, మత్యం 10 వార్డు రమణప్ప. యాదమరి మండలం కాశిరాళ్ళ 2వార్డు ఎ. రజని, వికోట మండలం కొంగొత్తం 1వార్డు వరలక్ష్మి, జీడి నెల్లూరు వరత్తూరు 2 వార్డు నాగరాజు, ఐరాల మండలం కాణిపాకం 5 వార్డు మౌనిక, గుడిపల్లి మండలం 4వార్డు మంజునాథ్ లు వార్డు సభ్యులుగా విజయం సాధించారు.

కాలేపల్లిలో ఎన్నికల అధికారులు నుంచి నాగరాజుకు గెలిచినట్లు ధ్రువపత్రాన్ని ఇస్తున్న దృశ్యం

గుడిపల్లిలో టిడిపి ఘన విజయం

గుడిపల్లి... మండలంలోని బేబీవాడ గ్రామ పంచాయతీకి చెందిన నాలుగో వార్డులో టిడిపి ఘన విజయం సాధించిందని ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ వెల్లడించారు. టిడిపి అభ్యర్థి జి.మంజునాథ్ 66 ఓట్లు సమీప వైసిపి అభ్యర్థిపై సాధించారు.

కొంగాటంలో 122 ఓట్ల ఆధిక్యం

వి.కోటలో ... కొంగాటం పంచాయతీ ఒకటో వార్డుకు వైసిపి అభ్యర్థి వరలక్ష్మి విజయం సాధించారు. మొత్తం 545 ఓట్లకు గాను 472 ఓట్లు పోలయ్యాయి. వైసిపి అభ్యర్థి వరలక్ష్మికి 296 ఓట్లు వచ్చాయి. సుజాతమ్మకు 174 రాగా, రెండు నోటాకు పోలయ్యాయి. వైసిపి నేత కోట్ల కిరణ్‌కుమార్‌రెడ్డి బలపరచిన వరలక్ష్మి 122 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.

యాదమరి మండలం కాశిరాళ్ళలో ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

12 ఓట్ల తేడాతో గెలుపు

యాదమరిలో... కాశిరాళ్ల పంచాయతీ రెండో వార్డులో వైసిపి అభ్యర్థి రజనీ విజయం సాధించారు. వైసిపికి 62 ఓట్లు, టిడిపికి 50 ఓట్లు వచ్చాయి. కేవలం 12 ఓట్ల ఆధిక్యంతో రజని విజయం సాధించారు.

కందూరులో మనోజ్‌కుమార్ ఏకగ్రీవం

సోమలలో ... మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరులో నాలుగో వార్డు మెంబర్ మనోజ్‌కుమార్ పోటీ లేకపోవడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

బైరెడ్డిపల్లిలో... బెలుపల్లి పంచాయతీ ఏడో వార్డులో వైసిపి అభ్యర్థి కె.భరత్‌కుమార్, గౌనితిమ్మేపల్లిలోని రెండో వార్డులో సి.రెడ్డెప్ప ఏకగ్రీవమైనట్లు ఎంపిడిఒ రాజేంద్ర బాలాజీ పేర్కొన్నారు.

గంగాధరనెల్లూరులో... వరత్తూరు పంచాయతీ కాలేపల్లి రెండో వార్డులో వైసిపి అభ్యర్థి నాగరాజు, టిడిపి అభ్యర్థి ముద్దుకృష్ణపై 48 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

ఏనుగుల దాడిలో రైతు మృతి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ఏనుగుల దాడిలో రైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసు కుంది. స్థానిక గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. ముదిరెడ్డిపల్లి గ్రామ రైతు మార్కొండయ్య(52) తన భార్య అరుణమ్మతో కలిసి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో ఆవులు మేపుకొని, వ్యవసాయ పనులు ముగించు కొని ఇంటికి వస్తున్న సమయంలో ఒక్కసారిగా ఏనుగు దాడి చేయడంతో మార్కొండయ్య అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని భార్య అరుణమ్మ కేకలు వేసుకుంటూ గ్రామంలోకి వెళ్లడంతో గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీ లించగా అప్పటికే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం స్థానిక సర్పంచ్ చంద్రమోహన్ బీట్ ఆఫీసర్ రవి, గార్డు దొరస్వామికి తెలియజేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే ఏనుగుల దాడిలో ముగ్గురు రైతులు మరణించినట్లు సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు రైతులు, గ్రామ స్తులు ఫారెస్ట్ అధికారులకు ఏనుగుల సమస్యను తెలియజేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగినప్పుడు చర్యలు తీసుకుంటాం అని చెప్పి ఆ తర్వాత ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే రైతులు ప్రాణాలు పోతున్నాయని గ్రామస్తులు తెలిపారు.

భూమన కరుణాకర్‌రెడ్డి చొరవతో...

సుదీర్ఘ సమస్యకు 'చెక్'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతిలోని స్థలాల రిజిస్ట్రేషన్ నిలుపుదలకు ఉద్దేశించిన సెక్షన్ 22(ఎ)ను తిరుపతి ఎంఎల్ఎ హోదాలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రద్దు చేయించిన అంశం మరోసారి శనివారం చర్చకు వచ్చింది. కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఉదయం తిరుపతి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష జరిగింది. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, తిరుపతి నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిలు ఈ అంశాన్ని మరోసారి ప్రస్తావించారు. దీనిపై రెవెన్యూ యంత్రాంగం సమగ్ర వివరణ ఇచ్చింది.

అసలు సమస్య ఇదే..

సెక్షన్ 22 (ఏ) కింద పోరంబోకు స్థలాలుగా పరిగణిస్తూ నగర పాలక సంస్థ పరిధిలోని తంబువాని గుంట, కొర్లగుంట, కొత్తపల్లి, చంద్రశేఖర్ రెడ్డి కాలని, ఎరుకల కాలని, జర్నలిస్ట్ కాలని (ఎల్లమిట్ట), కసంగడ్డ-కెనడి నగర్, భగత్ సింగ్ కాలని (ఓబులేసు కాలని), సుందరయ్య నగర్, శారది నగర్, సూరయ్య కట్ట, చెన్నారెడ్డి కాలనీ, సంజీవయ్య నగర్, సింగాల గుంట, నరసింహ తీర్థం రోడ్డు, తాతయ్య గుంట, బొమ్మగుంట ప్రాంతాలకు సంబంధించిన స్థలాల రిజిస్ట్రేషన్లు కాకుండా నిలుపుదల చేసింది. దీంతో తిరుపతిలో ఐదు వేల నివాస గహాల వరకు క్రయ విక్రయాలకు ఎలాంటి హక్కులు ఉండవు.

22(ఏ) భూములకు పరిష్కారం



ఈ సమస్యపై రెవెన్యూ శాఖ వివరణ

గతంలో జీవో ఎం.ఎస్ నెం. 232ను 2004, మార్చి 4న ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ప్రభావం తిరుపతి అర్బన్ పరిధిలోని 17 ప్రాంతాల్లో 104 ఎకరాల పరిధిలో ఐదువేల నివాసాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. తాజాగా వీటిని నిషేధిత సెక్షన్ 22(ఎ) కింద నుంచి తొలగిస్తూ ఆర్ఓసీ 283/2923 తేదీ 16/08/2023 ఉత్తర్వులు జారీ చేస్తూ జిల్లా కలెక్టర్‌కి పంపడం జరిగింది. దీనిపై జిల్లా కలెక్టర్ తుది ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది.

21, 22 న ఏపీపీఎస్సీ పరీక్షలు

● 390 మంది అభ్యర్థులకు పరీక్ష కేంద్రం ఒక్కటే ● అభ్యర్థులు ఉదయం 9 గంటలలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి ● డీఆర్‌వో యన్.రాజశేఖర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్ : జిల్లాల పునర్విభజన అనంతరం జిల్లాలో రెండోసారి ఏపీపీఎస్సీ పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని, ఎలాంటి చిన్న పొరపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని డిఆర్ఒ యన్.రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం డిఆర్ఒ ఛాంబర్‌లో ఏపీపీఎస్సీ పరీక్షలు ఈనెల 21, 22న తేదీలలో (సోమవారం, మంగళవారం) చిత్తూరు పట్టణంలో నిర్వహించనున్న ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై డిఆర్ఒ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉద్యోగాలకు ఏపీపీఎస్సీ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నందున, చిన్న పొరపాటు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చిత్తూరు పట్టణంలో ఒక్క పరీక్ష కేంద్రం శ్రీనివాస ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ (సీతమ్స్), తిరుపతి - బెంగుళూరు బైపాస్ రోడ్, మురుకంబట్టు, పరీక్ష కేంద్రాలలో 390 మంది అభ్యర్థులకు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఆగస్టు 21న మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, 130 మంది అభ్యర్థులు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పేపర్ 1. వ్రాయనున్నారు.ఆగస్టు 22 న ఉదయం 9.30 గంటల నుండి 12 వరకు. 130 మంది అభ్యర్థులు సివిల్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పేపర్ 2 పరీక్ష వ్రాయనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్ లలో 130 మంది అభ్యర్థులు సివిల్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ పేపర్ 3. పరీక్షలు వ్రాయనున్నారని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా సమయానికి గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. హాల్ టికెట్‌తో పాటుగా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదైనా ఐడి ప్రూఫ్ (డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు, పాన్ కార్డ్, ఓటర్ ఐడి కార్డు, ఉద్యోగి అయితే ఎంప్లాయ్ ఐడి కార్డు) తీసుకురావాలని తెలిపారు. ఓఎంఆర్ షీట్ లలో బ్లూ మరియు బ్లాక్ బాల పాయింట్ పెన్స్ మాత్రమే వాడాలని, హాల్ టికెట్ పై ఫోటో స్పష్టత లేని, సంతకం సరిగా కనిపించని నేపథ్యంలో అభ్యర్థులు 3 పాస్ పోర్ట్ సైజు ఫోటోలపై గెజిటెడ్ అధికారి ధృవీకరణ తీసుకొని రావాలని, సెల్ ఫోన్‌లు, క్యాలిక్యులేటర్‌లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు వంటి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాల పరీక్ష కేంద్రాలలోకి అనుమతించబడవని తెలిపారు.

పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డిఆర్ఒ

సమస్యల పరిష్కారంలో కమిషనర్ బేష్

పారిశుధ్య కార్మికుల సమస్యలను కమిషనర్‌తో చర్చిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషనరు వెంకటేష్ సంబంధిత అధికార్లతో చర్చించి సమస్యలు పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారని మున్సిపల్ వర్కర్ యూనియన్, ఎఐటియు నాయకులు తెలిపారు. ఈ మేరకు కమిషన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గోపీనాథ్, మణి, యూనియన్ నాయకులు దొరస్వామి, వాసు, జయశంకర్, సురేష్, వినాయక, సుగుణ, శోభన్ బాబు, సుభాషిని, సుకన్య, చిత్ర, ఈశ్వరన్, వెంకట్రావు జాయింట్ మీటింగ్‌లో పాల్గొని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు.

నేడు ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో మెడికల్‌క్యాంప్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: స్థానిక జైహింద్ పాఠశాల్లో ఆదివారం ఎపిటిఎఫ్ నేతృత్వంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు గోపినాథ్, ముత్తార్ అహ్మద్ శనివారం ఒక ప్రటనలో తెలిపారు. ప్రముఖ డయాబెటిక్ హాస్పిటల్ సౌజన్యంతో ఈ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజతకు డాక్టరేట్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: గంగాధర నెల్లూరు మండలం చిన్న వేపచేరి గ్రామానికి చెందిన ఆనంద రెడ్డి కుమార్తె విజత వేలూరు విట్ యూనివర్సిటీలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డును అందుకుంది. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డును పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందని విజిత తెలిపారు.

డాక్టరేట్‌ను పొందిన విజత

టీటీడీ బోర్డుపై ఎన్నో ఆశలు..!

ప్రజాశక్తి - తిరుమల

టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా భూమ కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. త్వరలోనే సభ్యుల నియామకం జరగనుంది. ఈ నేపథ్యంలో సిఫార్సులు పొరుగు రాష్ట్రాల నుంచి ఎక్కువయ్యాయి. దీనిపై తర్జనభర్జన జరుగుతోంది. ఆశావాహుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది.

ఇప్పటికే జాబితా సిద్ధం చేయటం కోసం పలు మార్లు పార్టీ పెద్దలలో సీఎం జగన్ సమావేశం అయ్యారు. అయినా లిస్ట్ ఇంకా ఫైనల్ కాలేదు. వచ్చే రెండు మూడు రోజుల్లో జాబితా రిలీజ్ చేస్తామని సజ్జలు రామకష్ణ రెడ్డి ఇటీవలే అన్నారు. తిరుపతి తిరుమల దేశస్థానం బోర్డ్ చైర్మన్‌తో పాటు టీటీడీ బోర్డు మెంబర్లు 25 మంది వుంటారు. తాజాగా టీటీడీ చైర్మెన్‌గా భూమన కరుణాకర రెడ్డిని నియమించిన సంగతి తెలిసిందే. ఇక మిగతా 24 మంది బోర్డ్ మెంబెర్స్‌ను నియమించాల్సి వుంది. ఈ లిస్టులో కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి ఆలయ అభివద్ధికి పాటు పడుతున్న పారిశ్రామిక వేత్తలకూ చోటు కల్పించాల్సి వుంది. ఇంతే కాక వివిధ సామాజిక వర్గాల వారికి టీటీడీ బోర్డ్ మెంబర్లుగా ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో టీటీడీ బోర్డు కూర్పు అన్నది ఇప్పుడు కష్టంగా మారింది.

కాగా, ఎమ్మెల్యే కోటాలో ఏపీ నుంచి పేర్ని నాని, ద్వారంపూడి చంద్ర శేఖర్ రెడ్డి, అలజంగి జోగారావుకి బోర్డ్ మెంబర్లుగా అవకాశం దక్కనుందని ప్రచారం సాగుతోంది. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా నుంచి సుబ్బరాజు, రంగావతి.. రాయలసీమ నుంచి ఆనందరెడ్డి సహా రాష్ట్రంలోని వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రముఖులను.. కర్ణాటక నుంచి సిద్ధరామయ్య కోటలో దేశ్‌పాండేని తీసుకోనున్నారన్న చర్చలు సాగుతున్నాయి. అయితే ఇవన్నీ ఎంత వరకు నిజమో, లేదో ఇంకా తెలియాల్సి ఉంది.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజినల్ ఆఫీసు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజినల్ కార్యాలయాన్ని, ల్యాబొరేటరీని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం ప్రారంభించారు. 34వేల చదరపు అడుగులతో రూ.16.50 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనానికి డాక్టర్ వైఎస్ఆర్ పర్యావరణ భవనంగా నామకరణం చేశారు. జూన్‌లో ఎన్నడూ లేని విధంగా263.13 మిలియన్ మెగావాట్ల విద్యుత్ వినియోగం పరిశ్రమల ఏర్పాటుకు నిదర్శనమన్నారు. ఎక్కడా కాలుష్యం లేకుండా కాలుష్య నియంత్రణ మండలి అనేక చర్యలు చేపట్టిందన్నారు. నూతన భవనంలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లో ఎప్పటికప్పుడు పరిశ్రమల్లో ఎలాంటి వ్యర్థాలు విడుదల చేస్తున్నాయో గమనించి అప్పటికప్పుడు చర్యలు చేపడతారన్నారు. ఆక్వారంగం ద్వారా జరిగే కాలుష్యాన్ని నివారించే చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి మద్దిల గురుమూర్తి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్లు మరకా శివకష్ణారెడ్డి, పాకా సురేష్, డాక్టర్ సునీల్ కుమార్, జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ కెవి రావు సీనియర్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రాజశేఖర్, ఆర్.ఓ కడప అశోక్ కుమార్ పాల్గొన్నారు

23న పీవీకేఎల్లో జాబ్ మేళా

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఈనెల 23వ తేదీన స్థానిక పివికేఎన్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమర్ రాజా గ్రూప్ అపోలో సంస్థలతోపాటు వివిధ ప్రముఖ సంస్థలు ఈ జాబ్ మేళాలో పాల్గొని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. కనీస విద్యార్హత పదవ తరగతి ఇంటర్మీడియట్ డిగ్రీ ఫైల్ అండ్ పాస్ అయిన 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలు వయసు కలిగిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఈ జాబ్ మేళాలో 20 బహుజాతి కంపెనీలు దాదాపు 12 వందల ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియామకల్లో అర్హత సాధించిన నిరుద్యోగులకు నెలకు యువతి యువకులకు నెలకు కనీస వేతనం పదివేల నుంచి 40 వేల వరకు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రవాణా సౌకర్యం, భోజన వసతి కూడా ఉంటుందని అనుభవం నైపుణ్యాన్ని బట్టి జీతం పెరుగుతోందని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు నాలుగు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డులు బ్యాంక్ అకౌంట్స్ జిరాక్స్ తీసుకురావాలని కోరారు. వివరాల కోసం 7893110120, 630095 4441, 9505601887 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

భక్తుల భద్రతకు టీటీడీ 'పెద్దన్న' పాత్ర పోషించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శేషాచలం అడవులను టైగర్ కారిడార్ పరిధిలో తెచ్చినట్లు మంత్రి పెద్దిరెడ్డి జులైలోనే ప్రకటించారు. ఈ విషయంలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని టిటిడి 'పెద్దన్న' పాత్ర పోషించాలి. గతంలో పెద్దపులులు 40 ఉండేవని, ఈ కాలంలో 80కి పెరిగాయని, పులుల విస్తృతి పెరిగిన నేపథ్యంలో నల్లమల అడవులు పులుల సంచారానికి, స్వేచ్ఛగా జీవించడానికి సరిపోవడం లేదన్నది వాదన. ఈ కారణాల రీత్యా శేషాచలం అడవులను టైగర్‌కారిడార్ పరిధిలోకి తెచ్చినట్లు మంత్రి ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. తిరుమలలో చిరుతపులుల ధాటికే బెంబేలెత్తుతున్న అధికారులు చిరుతల కంటే వంద రెట్లు బలమైన పెద్ద పులులు శేషాచలం అడవుల్లో ప్రవేశిస్తే ఏం చేస్తారో మరి. పర్యావరణ హితం కోరి, అటవీ చట్టాలను గమనంలో ఉంచుకుని, భక్తుల శ్రేయస్సును ప్రధానాంశంగా తీసుకుని ప్రభుత్వం నిర్ణయం చేయాల్సి ఉంది. సిసి కెమెరాలు, చేతికర్రలు తాత్కాలిక ఉపశమనాలని, శాశ్వత పరిష్కారం అనివార్యమన్నారు. ఫైర్‌లైన్ పనులు చేపట్టాలన్నారు. టిటిడి పరిధిలోని అటవీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, సంబంధిత శిక్షణ ఇప్పించాలని కోరారు. ప్రభుత్వ అటవీ విభాగంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. టిటిడి అటవీ విభాగంలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేదన్నారు. అటవీ ప్రాంతంలో విధులు నిర్వహించాల్సిన కార్మికులను టిటిడి అధికారులు తమ ఇళ్ల దగ్గర పని చేయించుకోవడం, వాహనాలకు డ్రైవర్లుగా వినియోగించుకోవడం, రోడ్డు డివైడర్లు, పార్కుల్లో పనులు చేయించుకుంటున్నారన్నారు. తిరుమల కొండపై వన్య మగాలు కొత్త కాదని, భక్తులూ కొత్త కాదని వేటి పని అవి చేయకుండా అడ్డుపడడమే దీనికి ప్రధాన కారణమని ఆరోపించారు. ఎర్రచందనం స్మగ్లర్లకు బలమైన అండదండలు ఉండటం వల్లనే ఏళ్ల తరబడి అడవుల్లో చెలరేగిపోతున్నారన్నారు. టిటిడి చొరవ చూపి అన్ని విభాగాల మధ్య సమన్వయం సాధించాలన్నారు. తిరుమల కొండమీద అటవీశాఖ, టిటిడి అధికారుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత తీవ్రమైన విభేధాలు ఉన్నాయన్నారు. భక్తులశ్రేయస్సుకై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నడకమార్గాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సింది పోయి చిరువ్యాపారులను అడ్డుకోవడం, భక్తులకు ఆటంకాలు సృష్టించడం అర్థం లేని చర్యలని అభివర్ణించారు. **(కందారపు) మురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి)**

ప్రజాదృష్టి

మరమగ్గ కార్మికుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం

ప్రజాశక్తి-నగరి: మరమగ్గ కార్మికుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యమిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం మున్సిపల్ పరిధి సత్రవాడ వినాయకపురంలో ఆమె గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు గజమాలలు, డప్పువాయిద్యాలతో హారతులు పట్టి ఆమెను ఆహ్వానించారు. మండల స్థాయి అధికారులతో కలసి ఆమె ప్రతి గడపకు పర్యటించి నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని నివాసితులకు వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త నేత సామాజికవర్గానికి చెందినవారే అని, తాను ఆ సామాజిక వర్గపు ఆడపడుచునే అన్నారు. ఆప్కోకు మాత్రమే పరిమితమైన ప్రభుత్వ యూనిఫామ్ తయారీని ముఖ్యమంత్రితో చర్చించి స్థానిక మరమగ్గ కార్మికులకు తీసివ్వడం జరిగిందన్నారు. కోవిడ్ సమయంలో ఆ ఆర్డర్లు ఎంతో మంది మరమగ్గ కార్మికులకు ఉపాధినిచ్చిందన్నారు. వివిధ సంక్షేమ పథకాలతోను మరమగ్గ కార్మికులను ఆదుకుంటున్నామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు తనకు ఎంతో అనుభవం ఉందని గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని, ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ఏదైనా సాంకేతిక కారణాల మూలంగా ప్రభుత్వ పథకాలకు దూరమైన పేదలను గుర్తించి న్యాయం చేయడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. చంద్రబాబు తన హయాంలో చెప్పుకునేలా చేసిందేమీ లేనందున నిస్పృహకు గురయ్యారని, ప్రజలను అయోమయం చేసేందుకు అసత్యారోపణలు, ఉద్దేశపూరిత ప్రసంగాలు చేస్తూ రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ఇస్తున్న ప్రాధాన్యతను, ఆ దిశగా అమలు చేసిన పథకాలను ప్రజలు అర్థమయ్యేలా విశదీకరించారు. పిల్లలను బడికి పంపే ఏ తల్లి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా అమ్మ ఒడితోపాటు జగనన్న విద్యా కానుక, విద్యా, వసతి దీవెనలు, విదేశీ విద్య తదితర పథకాలను సీఎం అమలు చేస్తున్నారని వివరించారు. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ బడులను ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా మార్చిన విషయాన్ని గుర్తు చేయాలన్నారు. సచివాలయం, వాలంటీర్ వ్యవస్థ ద్వారా పాలన ప్రజలకు చేరువైందన్నారు. మేలు చేసిన వారిని గుర్తుంచుకుని ఆశీస్సులివ్వాలన్నారు. ప్రజలు చెప్పిన సమస్యలను విన్న ఆమె గడప గడపకు నిధుల ద్వారా సమస్యలు పరిష్కారమౌతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ కన్వీనర్ బీఆర్వీ అయ్యప్పన్, జిల్లా నేత అనుబంధశాఖ అధ్యక్షులు కన్నాయిరం, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజనాన్ని రుచిగా అందించాలి

ప్రజాశక్తి-సోమల: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని వంట నిర్వాహకులు శుభ్రంగా, రుచికరంగా వండి విద్యార్థులకు అందించాలని మండల విద్యాశాఖ అధికారి శ్రీరాములు కోరారు. పెద్ద ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది, విద్యార్థుల హాజరు పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచికరంగా విద్యార్థులకు వండి వడ్డించాలని వంట నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మెరుగుకు కృషి చేయాలి

ప్రజాశక్తి-కార్వేటినగరం: పారిశుద్ధ్య మెరుగుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనంజయవర్మ అన్నారు. శనివారం స్థానిక వేణుగోపాలస్వామి మాడవీధిలో పంచాయతీ ఈవో పీఎస్ మణితో కలిసి ఆయన పారిశుద్ధ్యాన్ని మెరుగు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి పట్టణ ప్రజలు కంకణబద్ధులై ఉండాలని కోరారు. వీధుల్లో మురుగు నీరు ప్రవహించకుండా, తాగు నీరు వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం రాస్ వృద్ధాశ్రమం వద్ద నిలిచిన మురుగునీటిని తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రేషన్ పై ఎలాంటి ఫిర్యాదు అందలేదు

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన తోపు మఠం రేషన్ కార్డు లబ్ధిదారులకు బియ్యం అందలేదని ఎవరూ మాకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని మండల తహశీల్దార్ సీతారాం శనివారం ప్రజాశక్తికి తెలిపారు. రేషన్ బియ్యం అందలేదంటూ జాతీయ రహదారిపై రేషన్ కార్డు లబ్ధిదారులు ధర్నా రాస్తారోకో చేసిన సంఘటనపై పై విధంగా తహశీల్దార్ స్పందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకులు మాకు అందడం లేదని 13 వ వార్డు రేషన్ కార్డు లబ్ధిదారులు సమస్యను మా దష్టికి తీసుకురాలేదన్నారు. ఒకవేళ తీసుకొచ్చి ఉంటే వెంటనే మేము స్పందించి సమస్యను పరిష్కరించే వాళ్ళమని చెప్పారు. గత శుక్రవారం లబ్ధిదారులు ఆందోళన చేయడంపై వెంటనే స్పందించి సంబంధిత వీఆర్‌వోను అక్కడకు పంపించి వారికి బియ్యం అందేలాగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పట్టణంలో ఎక్కడైనా నిత్యావసర వస్తువులు అందడం లేదని ఫిర్యాదు చేస్తే వెంటనే వారి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ లక్ష్మీపతి ఆధ్వర్యంలో శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ భక్తులు ప్రజలు వాళ్ళింట్లో జరిగే శుభకార్యాలు, పుట్టినరోజు, పెళ్లిరోజున ఇలాంటి కార్యక్రమాలకు ప్రతి శనివారం ఆలయ ఆవరణంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తులకు ఏర్పాటు చేసే అవకాశాన్ని ఉపయోగించుకున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి సురేష్ కుమార్, డాక్టర్ భాగ్యలక్ష్మి, శతి భాగ్యం, మౌనిక, సత్యవాణి,ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

తిరుమలకు కాలినడకన బయలుదేరిన భక్తులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కుప్పనపల్లి, పాత పేట గ్రామాలకు చెందిన తిరుమల వేంకటేశ్వర స్వామి భక్తులు సుమారు 80 మంది కడపనత్తం, నల్లగుండ్రాయ స్వామి ఆలయానికి శనివారం చేరుకొని, అక్కడ స్వామి వారికి పూజలు నిర్వహించి, భజనలు చేశారు. అనంతరం తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనార్థం కాలినడకన బయలుదేరారు. జాతీయ రహదారిపై పసుపు దుస్తులు ధరించి నడుస్తుంటే భక్తి పర్వం ఉట్టిపడినట్టనిపించింది. భక్తులు కాలినడకన వస్తుంటే స్వాగతం పలికారు. కార్యక్రమంలో కుప్పనపల్లి, పాతపేట గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యను బోధించాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రణాళికాబద్ధంగా విద్యను బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్ర రావు అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, రాయల్ పబ్లిక్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర రావు మాట్లాడుతూ తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టులలో విద్యార్థులను చదివించి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలన్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పరిశీలన చేపట్టాలని, ఫార్మేట్ వన్ పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. గైర్హాజరైన విద్యార్థులను గుర్తించి వారిని క్రమం తప్పక పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని ప్రధానోపాధ్యాయులకు, తరగతి ఉపాధ్యాయులు చూడాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఇప్పటినుండే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని రాబోవు పరీక్ష ఫలితాల్లో 100 శాతం సాధించే విధంగా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. డిజిటల్ విద్యాబోధన ప్రోత్సహించాలని, ఐఎఫ్‌పీ లను పూర్తిస్థాయిలో ఉపయోగం లోకి తీసుకురావాలని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని, ప్రతి ఉపాధ్యాయుడు వద్ద బోధనా పద్ధతి ఉపాధ్యాయ డైరీ టిఎల్ఎం తప్పనిసరిగా ఉండాలని అలా ఉండని వారిపై చర్యలు ఉంటాయని తెలియజేశారు. తర్వాత ప్రైవేట్ పాఠశాల రాయల్ పబ్లిక్ పాఠశాలలో సందర్శించారు. విద్యార్థులకు సదుపాయాలు అందించడంలో ఎక్కడా రాజీ పడకూడదని ఐదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. టాయిలెట్స్ నిర్వహణ పై తగిన శ్రద్ధ చూపాలని ప్రభుత్వ ఉత్తర్వులు పాటించాలని, రవాణా సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు నాగేశ్వరరావు, రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపును వెంటనే ఆపేయాలి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని నీవానది నుండి ఇసుక తరలింపు ఆపేయాలని కోరుతూ వేల్కూరు దళిత వాడకి చెందిన యువకులు, పెద్దలు, మహిళలు ఇసుక రీచ్‌లో శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక తరలింపు పై సుప్రీంకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ అడ్డూ అదుపు లేకుండా భారీ ప్రొక్లైన్ యంత్రాలతో ఇసుక తరలిస్తున్నారని ధ్వజమెత్తారు. నిబంధనల ప్రకారం కాకుండా దళితవాడకు చెందిన, గ్రామాలకు చెందిన శ్మశానాలను, వ్యవసాయ బోర్ పైపు లైన్‌లు సైతం నాశనం చేస్తూ ఇసుక తరలిస్తున్నారన్నారు. విద్యుత్ స్తంభాలు సైతం నేలకొరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు నీవా నది బ్రిడ్జికి కూత వేటు దూరంలో ఈ ఇసుక అక్రమ దందా కొనసాగుతున్నదని, ఈ దందా ఇదే విధంగా కొనసాగితే బ్రిడ్జి సైతం దెబ్బతినే ప్రమాదం ఉందని, వెంటనే అధికారులు, ప్రజా నిధులు స్పందించి తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

పంటను ఈ క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి

ప్రజాశక్తి-యాదమరి: ప్రతి రైతు వేసిన పంటకు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఈ క్రాప్ నమోదు పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. శనివారం మండల పరిధిలోని మోర్ దానపల్లి, జంగాలపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో ఈ క్రాప్ నమోదును పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ సాగు పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చునని సూచించారు. ప్రతి రైతు తాము పండించే పంటను ఈ క్రాప్‌లో నమోదు కోవాలని రైతులకు సూచించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో మహిళా రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి సలహాలు, సూచనలు తెలియజేశారు. ప్రతి రైతు భూసార పరీక్షల ద్వారా రైతులు వారి భూముల స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. వాటికి కావలసిన పోషకాలు వ్యవసాయ అధికారుల, సూచనలు సలహాలతో అధిక దిగుబడిని పొందవచ్చునని తెలిపారు. రైతులు పండించే పంటలను క్షేత్రస్థాయిలో ఆర్‌బీకే సిబ్బంది రైతుల పొలాల్లో పర్యటించి చీడపీడలపై, సలహాలు సూచనలు తెలియజేయాలని తెలిపారు. అనంతరం జంగాలపల్లి ఆర్బీకే కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి చరిత, అగ్రికల్చర్ అసిస్టెంట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-పాలసముద్రం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి జి.సుధాకర్ అన్నారు. శనివారం మండలంలో తిరుమలరాజపురం పంచాయతీ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, చిత్తూరు విజయం కళాశాల విద్యార్థులు జన విజ్ఞాన వేదిక అనే ఓ సైన్సు ప్రచార సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి పాలసముద్రం రహదారి నుండి తిరుమలరాజుపురం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల దాకా 50మంది విద్యార్థులు రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటికి ప్రతిరోజూ నీరు పోసి పెంచాలని, వాటిని పరిరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ స్వీకరించాలని అప్పుడే మన చుట్టూ పచ్చని ప్రకృతి ఏర్పడి ఆహ్లాదాన్ని ఆనందాన్ని ఆరోగ్యాన్ని అందిస్తుందన్నారు. జన విజ్ఞాన వేదిక పర్యావరణ పరిరక్షణకు పాటుపడటం కాలుష్యం చిచ్చు రేపుతున్న వాటిని అరికట్టేందుకు కృషి చేయడం తమ లక్ష్యమని, తిరుమల రాజపురం రహదారిలో దాదాపు ఇరువైపులా 30 రకాల గింజలతో మట్టితో ఉంటలు చేసి రోడ్డుకి ఇరువైపులా చల్లమని అలాగే రోడ్డుకి ఇరువైపులా చింత,వేప, కానుగ, తంగేడి, నేరేడు, బాదం, తాటి చెట్లు 2000 మొక్కలు నాటమని ఇందుకు ఉపాధ్యాయులు విద్యార్థులు సహకరించారని తెలిపారు. ఉపాధ్యాయులు వి.మురగదాసు, కే.శ్రీనివాసులు, డి.హరి ప్రసాద్, వి.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: గడచిన కాలాన్ని గుర్తించేది ఫోటోగ్రఫీ అని మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శంకరన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఫోటోగ్రాఫర్లు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ కార్యక్రమం జరుపుకున్నారు. ఈ సందర్భంగా శంకరన్ మాట్లాడుతూ లూయిస్ డాగురె ఫోటోగ్రఫీ కనుగొన్నారని, ఆయన సేవలను గుర్తిస్తూ ఆయన జన్మదినోత్సవాన్ని ఆగస్టు 19న ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ డే గా జరుపుకుంటున్నామని,

బంగారుపాళ్యం

ఆయన ఎందరికో ఫోటోగ్రఫీలో ఉపాధి కల్పించారని, దినదినాభివృద్ధితో ఈరోజు డిజిటల్ స్థాయికి ఎదిగామని చంద్రయాన్ త్రీలో కూడా అమర్చిన కెమెరాల వలన లక్షల దూరంలో ఉన్న చిత్రాలను కెమెరాలు బంధించి ఇంటర్నెట్ ద్వారా అనుసంధానం అవుతుందని ఇది ఆయన ఘనత అని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూజలు చేసి ఫోటోగ్రాఫర్స్ వర్ధిల్లాలని నినాదించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పాలు, బ్రెడ్డు, పండ్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్ కుమారి, మండల ఫోటోగ్రాఫర్స్ కార్యదర్శి చిట్టిబాబు, కోశాధికారి చాన్ బాషా, ఫోటోగ్రాఫర్లు తేజ, దుర్గాప్రసాద్, రేవంత్, మురళి, అయూబ్, సంధ్య, కార్తీక్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పలమనేరులో ఫోటో, వీడియో గ్రాఫర్లు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వారు పట్టణంలోని శ్రీకష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి, అనంతరం కెమెరాను కనుగొన్న లూయిస్ జాకస్ మండే డాగురె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదుపరి వారు అన్నదాన కార్యక్రమం

పలమనేరు

నిర్వహించి, సీనియర్ ఫోటోగ్రాఫర్స్‌కు సన్మానం చేశారు. అలాగే యూనియన్ తరపున ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్‌కు రూ.లక్ష విలువగల ఇన్స్యూరెన్స్ చేసి వాటి బాండ్లను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పలమనేరు శ్రీపురం సీతారామన్న పాల్గొని మాట్లాడారు. ఫోటో, వీడియో గ్రాఫర్లు అందరూ కలిసి మెలిసి, మారుతున్న కాలాన్ని బట్టి టెక్నాలజీని అందిపుచ్చుకొని అభివద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో మాజీ డిసిసి సుధాకర్, మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు, పలమనేరు గంగమ్మ గుడి ఛైర్మన్ నరేష్, పిజెసి బాబు లు పాల్గొని ఫోటో, వీడియో గ్రాఫర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పిఎస్ వెంకటేష్, ఉపాధ్యక్షులు సురేష్, సెక్రటరీ జి వెంకటేష్, ట్రెజరర్ రాఘువ, స్టేట్ ఈసీ మెంబర్ చందు తదితరులు పాల్గొన్నారు.

భద్రతకే వివరాల సేకరణ

ప్రజాశక్తి-నగరి: ముఖ్యమంత్రి విద్యాదీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి నగరి పట్టణానికి విచ్చేస్తున్నందున భద్రతలో భాగంగానే రోడ్‌షో జరగనున్న మార్గంలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని సీఐ సురేష్ తెలిపారు. రోడ్‌షోలో భాగంగా దుకాణాలు మూసివేయాలంటూ తప్పుడు ప్రచారాలు ఊపందుకున్న నేపథ్యంలో శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్పష్టత ఇచ్చారు. భద్రతా చర్యల్లో భాగంగానే రోడ్‌షో జరిగే మార్గంలో ఇళ్లులు, షాపులు ఎవరివి ఉన్నాయి. అందులో వారే కాపురంవుంటున్నారా? లేక బాడుగలకు ఇచ్చారా? బాడుగకు ఇచ్చినట్లయితే వారు ఎప్పటి నుంచి అక్కడ ఉన్నారు అనే వివరాలు సేకరించడం జరిగిందన్నారు. ఎవ్వరినీ దుకాణాలు మూసివేయమని తాము చెప్పలేదన్నారు. 28న దుకాణాలు మూసివేయాలంటూ వస్తున్న వార్తలు నిజం కాదన్నారు. అలాగే పట్టణ పరిధిలో ఎవరైనా నూతన వ్యక్తులు సంచరించినా, అనుమానాస్పదంగా కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

'మేటిమంద'లో వైద్య సేవలు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ మేటి మంద గ్రామంలో 104 వాహనం ద్వారా వైద్య సిబ్బంది గ్రామస్తులకు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్వాడీ కేంద్ర విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సీహెచ్‌వో అమర్‌నాథ్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 74 మంది రోగులకు బిపి, షుగర్, ఇతర వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులు, మాత్రలను అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీలోని 38 మంది విద్యార్థులకు ఎత్తు, బరువు, హెచ్‌బి, ఇతర పరీక్షలను నిర్వహించి వారికి మాత్రలను పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ అత్యవసర పరిస్థితులలో 108, 104 వైద్య సిబ్బంది సేవలను కచ్చితంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మదనిక, ఎమ్ఎల్‌హెచ్‌పి శాంభవి, ఆశా కార్యకర్తలు శ్రీలత, గుణవతి, నాగరత్న, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లి పంచాయతీ బయ్యా రెడ్డి పల్లెలో ఉచిత పశువైద్య శిబిరాన్ని పశువైద్యాధికారిణి చందన ప్రియ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 72 పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు, పది దూడలకు నట్టల నివారణ మందు తాపించడం, 12 పశువులకు గర్భకోశ వ్యాధి సమస్యలకు సంబంధించి చికిత్స అందించినట్లు తెలిపారు. పశువిజ్ఞాన బడి కార్యక్రమం ద్వారా అధిక పాల దిగుబడికి తీసుకోవాల్సిన చర్యలు, పుట్టిన దూడ నుండి తిరిగి దూడ పుట్టే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశు యజమానులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏహెచ్ బలరాం, సిబ్బంది రామకష్ణ, వెంకటరమణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రచార బస్సు యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పలమనేరు: రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ చేపట్టిన ప్రచార బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యస్.నాగరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని బస్టాండ్ కూడలి వద్ద నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ఎం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు సిపిఐ ప్రచార జాత బస్సు యాత్ర గోడ పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు చెన్నకేశవులు, పట్టణ కార్యదర్శి బుర్ర మంజునాథ బాబు, నాయకులు గుర్రప్ప, కదిరప్ప, రామమూర్తి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం నివాళి

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవీబీ పేట పంచాయతీ రాజుల కండిగ గ్రామానికి చెందిన ఎం.రజిని అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. దీంతో విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మృతుడి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మండల కన్వీనర్ శేఖర్ రాజు, సర్పంచ్ దివ్య దుశ్యాంత్, వైసిపి నాయకులు ఇవి.చందు రాజు, వెంకటరత్నం లు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: చిత్తూరు-పుత్తూరు జాతీయ రహ దారిపై కారు దగ్ధమైన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు... మండలం లోని ముద్దికుప్పం గ్రామపంచాయతీ లక్ష్మీపురం వద్ద నయారా పెట్రోల్ బంక్ పక్కన చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి పైన ఎస్ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కపిలన్ తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టు నుండి మండలంలోని నెలవాయి వద్ద గల ఎస్ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీకి పని నిమిత్తం వస్తున్న క్రమంలో కారులో మంటలు చెలరేగడంతో కారు డ్రైవర్ అప్రమత్తమై కారు నుంచి ఆపి దిగడంతో కారులో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక కేంద్రం కారు మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైపోయింది.

అందరికీ అందుబాటులో జగనన్న మహిళా మార్టులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అందరికీ అందుబాటులో జగనన్న మహిళా మార్టులు, డ్వాక్రా ఉత్పత్తుల అమ్మకాల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. శనివారం పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా కార్యాలయంలో అర్బన్ మార్కెట్ ప్రారంభోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు, మహిళల ఆదాయాన్ని పెంచేందుకు ఎన్నో వినూత్నమైన ఆలోచనలను ఆవిష్కరిస్తున్నామని, అందులో ఈ ఆహా క్యాంటీన్లు, జగనన్న మహిళా మార్టులు, డ్వాక్రా ఉత్పత్తుల అమ్మకాల కేంద్రాలు చాలా కీలకమైనవని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని డ్వాక్రా మహిళలకు వారిలో ఉన్న నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని గుర్తించి ప్రభుత్వమే సహకారాన్ని అందించి వారి ఆదాయాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. డ్వాక్రా మహిళలకు బ్యాంక్ లింకేజీ కింద ఒక్కొక్క గ్రూపునకు రూ.20 లక్షలు , "జగనన్న తోడు" కింద గతంలో ఒక్కొక్కరికి రూ.10 వేలు ఇవ్వగా.. ప్రస్తుతం రూ.13 వేలు ఇవ్వడం జరుగుతోందని, అలాగే స్త్రీనిధి కింద రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రిలయన్స్, హెరిటేజ్, బిగ్ బజార్ వంటి కార్పొరేట్ సూపర్ మార్కెట్‌లకు ధీటుగా జగనన్న మహిళా మార్టులను ఏర్పాటు చేస్తున్నారని, వీటితో వ్యాపారాభివృద్ధి చెంది మహిళల ఆదాయం మరింత రెట్టింపు అవుతుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్లు జయప్రకాష్, శంకర్, కౌన్సిలర్లు, రాష్ట్ర డైరెక్టర్లు, కమిటీ ఛైర్మన్లు జిల్లా మెప్మా అధికారి, మునిసిపల్ కమిషనర్ కేఎల్ఎం ఎన్ రెడ్డి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని మహతి ఫౌండేషన్ సంస్థ వారి సహకారంతో పిఇఎస్ హాస్పిటల్ కుప్పంలోని నిపుణులైన డాక్టర్లతో ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మహతి ఫౌండేషన్ సహాయ మేనేజర్ శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతర ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలు ఎవరైనా కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల బైరెడ్డిపల్లిలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఎస్ఎస్‌సీ, ఇంటర్‌కు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వనాథయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడ్మిషన్లకు అప్లై చేయుటకు చివరి తేదీ అక్టోబర్ 10వ తేదీ వరకు కలదని తెలిపారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు ఫోన్ 9966575834, 8790792100 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నీటి ఎద్దడికి నివారణ చర్యలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా రైన్ గన్లు, స్ప్రింక్లర్లు, సాగు నీటి సరఫరా పైపులు (వాటర్ క్యారీయింగ్ పైప్లు) ఆయిల్ ఇంజిన్లు రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అందుబాటులో ఉంటాయని వ్యవసాయశాఖ జేడి మురళీ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాధారంగా సాగు చేసిన వేరుశనగ పంటకు నీటి ఎద్దడిని అధిగమించడానికి నీటి తడులను ఇవ్వడానికి రైతు సోదరులు తమ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాలలో ఉన్న రైన్ గన్లు, స్ప్రింక్లర్లు, సాగు నీటి సరఫరా పైపులు (వాటర్ క్యారీయింగ్ పైప్లు) ఆయిల్ ఇంజిన్లు తీసుకొని ఉపయోగించుకోవాలని తెలిపారు. రైతులు ఉపయోగించిన తరువాత మరలా రైతు భరోసా కేంద్రానికి తిరిగి చేర్చాలని, రవాణా ఖర్చులు, ఏదైనా రిపేర్లు అయితే ఆ ఖర్చును ఉపయోగించుకున్న రైతులే భరించాలని పేర్కొన్నారు.

23న పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈనెల 23 న ఉదయం 10 గంటలకు జరుగునని, కావున పెన్షనర్లందరూ హాజరుకావాలని చిత్తూరు జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి ప్రభాకర్ నాయుడు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ రామాంజనేయులు కొత్త కార్యవర్గాన్ని ప్రకటిస్తారని,పెన్షనర్లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.